

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# కలల శీను

**జీవితంలో** పెతీ పనికిమాలిన వాడికీ కొన్ని కలలుంటాయి. కాబట్టి నాకూ వున్నాయి. రేపటినించీ కష్టపడి పని చేయుట, డాక్టరు అగుట, అందమయిన పెండ్లామును పెండ్లిచేసుకొనుట (అంటే నా వుద్దేశం వేరే వాడి పెళ్ళాన్నని కాదు, అందమైన అమ్మాయిని  అని సారాంశం, ఊ.. కిచకిచలూ మీరూను ), పిచ్చ పిచ్చగా డబ్బు సంపాదించుట, లంకంత కొంప, కొంపని పట్టిన చెరువు, చెరువులో పడవ కొనుక్కుని ఊరేగుట,  త్రిపాది గాడిలా దేశములు తిరుగుట హిల్లాటివన్నామాట. నేను ఇప్పుడు చెప్పేది అల్లాంటి కలలగురించి కాదు. మీరు లంచి తరవాత ఆఫీసులో పడుకున్నప్పుడో, రాత్రి బాగా పొద్దోయాకా ఫేసు బుక్కు లో ప్రతీ వాడూ మిమ్మల్ని బండ బూతులు తిట్టి **"**ఓ పక్క తెల్లారిపోతోంది**,** ఇంక పడుకుంటావా పడుకోవా, పిశాచప్పీనుగా**"** అని దీవించి, మీతో మాట్లాడడం మానేస్తే, విధిలేక మీరు తొంగున్నప్పుడో వచ్చే కలల గురించన్నమాట.

అందరికీ కలలొస్తాయి. లేవగానే మర్చిపోయి మళ్ళా పనిలో పడిపోతారు. కానీ నేను కొంచెం తేడా కదా. తయారీలో లోపం. చిన్నప్పట్నించీ నాకొచ్చిన కలలన్నీ నాకు గుర్తే. ఒక్కోసారి, కల ఇంటరెస్టింగ్ గా ఉంటే, లేచాకా ఓమాటు నెమరేసుకుని,  మళ్ళీ పడుక్కుని ఎక్స్టెన్షన్ కి అప్లై చేసి, కల పూర్తిచేసిన రోజులున్నాయి. కొన్ని కలలు పూతరేకులు సీరియల్ లాగా అలా కంటిన్యూ అయ్యేవి. ఒక్కో రాత్రి "ఇంతవరకూ జరిగిన కల**"** అని కూడా వచ్చేది. రాను రాను నేను కలలకి టైటిల్సు ఇవ్వడం మొదలుపెట్టి ఆయనెవరో వేదాల్ని విభజించినట్టు, నేను కలలని విభజించి దాచి పెట్టుకునేవాణ్ణి. సాంపిల్ కి ఒకటొదులుతాను చూడండి. (ఈక మీకు రాముడే రక్ష).

ఒక ఎడారి. మధ్యలో పేద్ద పెంకుటిల్లు. బైట గుఱ్ఱపు డెక్కల చప్పుడు. "హరే, హం ...తుం, నహీ..క్యోం.**"** అంటూ పదిమంది బందిపోట్లు దిగి, బైటంతా చుట్టుముట్టేసారు. వాళ్ళు బందూకులతో కాల్చడం మొదలెట్టారు. లోపల అవతల కటకటాల్లో అన్న, ఇవతల కటకటాల్లో నేను ఓ వారగా నించొని, పిస్టల్స్ తో వాళ్ళని కాల్చేస్తున్నాము.  సడెన్ గా అన్న దగ్గర బుల్లెట్లు అయిపోయాయి. నేను నా పిస్టల్ ముద్దు పెట్టుకుని అన్న దగ్గరికి విసిరాను. ఆన్న "శెభాష్" అన్నట్టుగా ఓ చూపు చూసి, ముద్దుపెట్టుకుని కాల్చాడు (నన్ను కాదు, వాళ్ళని). తుస్సు మంది. "ఒరేయ్, దీంట్లో కూడా బుల్లెట్లు లేవు రా,  కుంకా**"** అన్నాడు ఆందోళనగా. అంతే, అది విని అర్థం చేసుకున్న హిందీ బందిపోట్లు మెల్లిగా తలుపులు తీసి మమ్మల్ని చుట్టుముట్టారు.

అంతే....నాకూ అన్నకీ రెక్కలొచ్చేసాయి. మా చేతుల్లో షాడో నవల్లో లాగ లేజర్ గన్నులొచ్చేసాయి. అంతే మేము అమాంతం పిట్టల్లా ఆకాశంలోకి ఎగిరి ఆ బందిపోట్లని మనుషుల్ని కాల్చినట్టు కాల్చిపారేసాము. ఈ కల పేరు షోలే కల. దానికి కాస్త ఇంప్రొవైజేషనన్నమాట. అన్నట్టుచెప్పడం మర్చిపోయాను, ఈ కల ఎక్స్టెన్షన్లో మా హెడ్మేస్టారు ఠాకూర్. మై నాచూంగీ అంటూ డేన్సు చేసే అమ్మాయి పేరు...అమ్మో ఆశ, నేను చెప్పనుగా..

ఇలా కలలు కనీకనీ, వయసొచ్చేకొద్దీ వాటిని విశ్లేషించడం మొదలెట్టాను పనిలేక. కలలనగా నేమి? అవి ఎందుకువచ్చును? ఎలా వచ్చును? ఈ విషయాలపై ఎన్నో పనికిమాలిన పుస్తకాలు చదివాను. అన్నీ ఒకటే చెప్పాయి. చిన్నప్పుడు మీ బాబు నిన్ను కొట్టేవాడు కాబట్టి, మీ అమ్మ నీకు సరిగా తిండెట్టలేదు కాబట్టి, మీ పనిమనిషి అంట్లు సరిగ్గా తోమలేదు కాబట్టి, మీ పక్కింటి ఆంటీ నిన్ను సెక్రటరీ సినిమాకి తీసుకెళ్ళలేదు కాబట్టి అని.

నా కేసులో ఇవేవీ కరెక్టు కాదు కాబట్టి ఒగ్గేసాను. నేనే సొంతంగా కనిపెట్టడం మొదలెట్టాను. ప్రతీ కలకీ కారణం రాసి పెట్టేసుకున్నాను. ఆనక కాలేజీలోనూ, యూనివర్సిటీలోనూ కన్సల్టింగ్ మొదలెట్టి కావలసినన్ని సమోసాలూ, టీలూ స్వీకరించాను. చేతిలో చెయ్యేయించుకుని, కళ్ళలో కళ్ళు పెట్టి, అమ్మాయిల కలల్ని విశ్లేషించడం ఓ కళ.

దీన్నే "సోది" కళ అంటారని తరవాత తెలిసింది. నోటి కొచ్చింది వాగి అమ్మాయిల్ని నవ్వించడం, వాళ్ళు మనతో కూర్చుని నవ్వుతూ ఉంటే అందరూ ఉడుక్కోవడం. ఓ సారి ఇది మా యూనివర్సిటీ ఠాకూర్ గాడి కంట పడింది. ఆరోజు రాత్రి " నేను రెండు సెమిస్టర్లు రిపీట్ చేసినట్టు, నా క్లాస్మేట్లే నాకు సీనియర్లయిపోయినట్టు" పీడకలొచ్చింది. అంతే, అప్పటినించీ నా విశ్లేషణలు ఆగిపోయాయి. ఇవన్నీ నా పాత డైరీల్లో పచ్చని సోది జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

అయితే వారం రోజుల కిందట పక్కూళ్ళోని యూనివర్సల్ మాల్ లో మా కాలేజీ నేస్తం అనుకోకుండా కనపడడం, ఆవిడ మా రాణీ గారికి ఈ విషయాలన్నీ చెప్పేసి, నా సోది కళకి మళ్ళీ ప్రాణం పోసేయడం చక చకా జజరిగిపోయాయి. అప్పటినించీ మా శాల్తీ నన్ను ఆరాధనా భావంతో చూడసాగింది.

"అసలు మీరు కలలని అంత బాగా ఎలా ఎనలైజ్ చేస్తారండీ?" అమాయకంగా అడిగింది.

"ఈ..హహ..మరేంటనుకునావు, సెంట్రల్ యూనివర్సిటీయా, మజాకా." అన్నాను తలెగరేస్తూ.

"అక్కడ ఇవన్నీ చెబుతారాండీ" అంది అంతే అమాయకంగా.

నేనో పిచ్చి చూపు చూసి ఊరుకున్నాను. కాస్త ఎగస్ట్రా కటింగిచ్చి, "నీకలలన్నీ నాకు చెప్పాలి సరేనా?" అన్నాను సుడిగుండాల్లో నాగేస్రావులా. సరేనంది.

నిన్న పొద్దున నామానాన్ని నేను ఫేసుబుక్కులో వుంటే,

"ఏవండీ నాకు ఈ మధ్య రోజూ ఓ కల వస్తోందండీ" అనేసి చెప్పడం మొదలెట్టేసింది.

"నేను, మా ఆఫీసు వాళ్ళూ కార్లులో వెళ్తున్నాంట. ఒక జంక్షన్ దగ్గర పిచ్చి జుట్టు, మాసిన గెడ్డంతో ఒకడు, అచ్చం మీలాగే వున్నాడండీ, వాడేమో "విల్ వర్క్ ఫర్ ఫుడ్" అని రాసుకుని డబ్బులడుగుతున్నాడు. అందరూ తలో డాలరూ తీసిచ్చారు.

నేను ఇద్దామనుకుని ఎందుకో ఆగిపోయాను. ఇంతలో తెలివొచ్చేసింది. నేనెందుకివ్వలేదండీ? ప్లీజ్ చెప్పండీ.." అంటూ తన చెయ్యి నా చేతిలో వేసింది.

ఎప్పటి లాగే చెయ్యి రాస్తూ మొదలెట్టాను "నీ దృష్టిలో నీ మొగుడు గాడు ఆటైపన్నమాట. ఎలాగూ ఇంట్లో తిండెడుతున్నాం కదా, ఇంకా డబ్బులెందుకు దండగ అని నువ్వు ఇవ్వలేదు, అంతే. ఐ హర్ట్." అన్నాను కోపంగా.

"ఛీ అదేంకాదు. ఇలా అయితే నేను చెప్పనమ్మా..." అనేసి నవ్వుకుంటూ వెళిపోయింది. సాయంత్రం మళ్ళీ వచ్చింది.

"ఇందాక పడుకున్నప్పుడు కూడా ఆల్మోస్ట్ ఇలంటి కలే వచ్చిందండీ. అయితే ఇప్పుడు జంక్షన్లో వున్నది అచ్చం మీలాంటి ప్రిన్సు, తెల్ల గుర్రం మీద అలా కదలకుండా నించుని అందరికీ హాయ్ చెబుతున్నాడు" అంది నవ్వుతూ.

"గుర్రవెక్కి కదలకుండా నించోడానికి నేనేవన్నా కాటన్ దొర స్టాట్యూనా? ఇలాంటి మేకప్ కలలని నేను ఈజీగా పట్టేస్తాను. అబద్ధాలాడకు" అన్నాను బుంగమూతెట్టి.

"హమ్మో భలే పట్టేసారు. నిజంగానే మీరు మాస్టర్, ఎక్స్పర్ట్" అనేసి బుగ్గ గిల్లేసి, ఫేస్ బుక్ లో ఏదో అప్ డేట్ చేస్తూ వెళ్ళింది.

ఇంతలో నా పెద్దకూతురొచ్చింది.

"నాన్నా, ఒక డ్రీమ్ నాన్ను చాలా భయపెడుతోంది, చెప్పనా?" అంది.

చేసేది లేక "చెప్పు" అన్నాను.

"ఆల్మోస్ట్ వారానికి నాలుగు సార్లు వస్తుంది. ఎవరో ఒక రాక్షసుడు, ముసుగు వేసుకుని నా వెనకాల వస్తాడు. మనయింటి దాకా నన్ను చేజ్ సేస్తాడు. నేను ఇంట్లోకొచ్చి తలుపు వేసి, సెక్యూరిటీ ఆన్ చేసి భయం భయంగా దుప్పటీ కప్పుకుని పడుకుంటాను. వాడేమో రోడ్డుమీద చాలా సేపు వెయిట్ చేస్తాడు. తరవాత వెళిపోతాడు. చెప్పు ఏంచెయ్యను?" అంది.

నేను ఆలోచించి "నీదగ్గర లంచ్ బేగ్ లో ఒక ఫోర్క్ ఉందా" అని అడిగాను.

"వుంది" అంది ఆసక్తిగా వింటూ.

"ఈ సారి నువ్వు వెనక్కి తిరిగి వాణ్ణి ఫోర్క్ తో గుచ్చేయ్. వాడే పారిపోతాడు. ఫోర్క్ అంటే త్రిశూలం, తెలుసా.." అన్నాను నమ్మిస్తూ.

"కానీ నా పేరు లక్ష్మి కదా, త్రిశూలం దుర్గా దేవిది కదా" అని లాజిక్కు లాగింది.

నాకు మండింది. అయినా కంట్రోల్ చేసుకుని

" ఆ, వాడు ముసుగులో వున్నాడుగా, కనపడదు, దుర్గాదేవే పొడిచిందనుకుంటాడన్నమాట" అన్నాను నవ్వేస్తూను. ఏ దేవతో కరుణించి ఆ మంత్రం పని చేసింది. దాని భయం పోయింది.

నా వ్యవహారం కాస్తా మా ఆవిడ ఫేస్ బుక్ లోకెక్కి, అక్కడినించీ నా కన్సల్టింగు మళ్ళీ మొదలెట్టాల్సి వచ్చింది. ఇదిగో ఇందాకే ఓ పీనుగ వచ్చాడు. వాడితో సెషన్ జరిగింది. మధ్య మధ్యలో ఫేస్ బుక్ లో ఓ వందమంది బుకింగులు. సెషన్ వినండి..

"సార్, మీలాంటివాళ్ళ కోసమే చూస్తున్నా సార్. ఇట్టా చెప్పెటోళ్ళు, మన తెలుగోళ్ళు ఎవ్వరు లేరు సార్. నిజంగా ఓ కల చాలా బోదర్ చేస్తోంది సార్"

"చెప్పండి"

"నేను నీళ్ళ మీద డ్రైవ్ చేసుకుంటూ ఆఫీసుకెళ్ళాను సార్. అక్కడ మా ఆఫీసు ఎగురుతోంది సార్. దాంట్లో నేను వెళ్ళేసరికి లోపలంతా వాన సార్. నా డెస్క్ దగ్గర రెండు కప్పలున్నాయి సార్. ఇంతలో బాస్ పిలిస్తే వెళ్ళాను సార్. అంతే మా బాస్ రూమ్ తలుపు తియ్యగానే భయంతో గుండె ఆగిపోయింది సార్. లోపల మా అ..త్త..గా..రు సార్...రోజూ ఇదే కల సార్..." అని బావురు మన్నాడు.

నేనింక తట్టుకోలేకపోయాను. వాణ్ణి ఓదార్చి వాడి జబ్బకి ఒక తాయెత్తు కట్టి, ఫైర్ ప్లేసులోంచి బూడిద తీసి వాడి నోట్లో కొంచెం వేసి "రోజూ పడుక్కునే ముందు మీ ఆవిడకి దండం పెట్టుకుని పడుకో" అని చెప్పి పంపేసాను. లోపలికొచ్చి ఇప్పుడే రిలాక్స్ అవుతున్నాను.

ఇంతలో ఎవడో టెక్స్ట్ "నమస్తే సార్. నాకు ఒక కల వున్నాది సార్. ఒక కాకి భౌ భౌ మంటూ పుట్టలోంచి తొంగి చూస్తోంది సార్. చీమలన్నీ ఎగురుకుంటూ పోతున్నాయి సార్."

ఇంక నావల్ల కాలేదు. వెంఠనే ఫేస్ బుక్ ఎకౌంటు తీసేసి, మా ఆవిడకీ, జూనియర్ లక్ష్మీ దేవికీ దణ్ణం పెట్టుకుని పడుకున్నాను.

ఒక్క కలొస్తే మీమీదొట్టే !!

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS